నేత్రసేకరణ కేంద్రానికి ప్రభుత్వ ఆమోదం

పులివెందుల టౌన్ : పులివెందుల స్నేహిత అమృతహస్తం సేవా సమితి నేత్రసేకరణ కేంద్రానికి జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా కడపలోని అంధత్వ నివారణ సంస్థ కార్యాలయంలో జిల్లా అంధ్వత్వ నివారణ అధికారి డాక్టర్ సునీత చేతుల మీదుగా ఆమోద పత్రాన్ని స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, నేత్రసేకరణ కేంద్రం టెక్నీషియస్ హరీష్‌లకు అందజేశారు. జిల్లా అంధ్వత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నేత్రసేకరణ నిర్వహించడం జరుగుతుందని సేవా సమితి అధ్యక్షుడు తెలిపారు.

ముగిసిన పంచాయతీ అభివృద్ధి శిక్షణ తరగతులు

సింహాద్రిపురం : మండలంలో గ్రామపంచాయతీల అభివృద్ధిపై తీసుకోవాల్సిన చర్యలపై మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ శిక్షణ తరగతులను ఈవోపీఆర్డీ పద్మనాభరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక తయారు చేయుటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

పులివెందుల టౌన్ : క్షయవ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సూపర్‌వైజర్ నాగ్లానాయక్ తెలిపారు. బుధవారం స్థానిక శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో క్షయ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. క్షయవ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్, సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

వేంపల్లె : ప్రస్తుతం రోజురోజుకు పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాల పట్ల ప్రతి విద్యార్థి అవగాహన కలిగిఉండి తమ తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులకు వివరించాలని సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక అక్షర బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో మహిళా భద్రత, రక్షణ, సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ మోసాలు, ఆత్మహత్య నివారణ, ట్రాఫిక్ రూల్స్, మహిళా భద్రత యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. మహిళా భద్రత రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. 100 డైల్, సోషల్ మీడియా, ఓటిపి ఫ్రాడ్స్, సైబర్ నేరాలు, టోల్‌ఫ్రీ నెంబరు 1930 గురించి వివరించారు. కళాశాల కరస్పాండెంట్ విజయభారతి, పోలీసు సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

‘హర్ ఘర్ తిరంగ’ ర్యాలీ


జమ్మలమడుగులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు తదితరులు


చక్రాయపేటలో ..


వేంపల్లిలో ..


ఎర్రగుంట్లలో..

కమలాపురం : 78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగ ర్యాలీ నిర్వహించారు. బుధవారం బీజేపీ నాయకుల నేతృత్వంలో పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. జోనల్ ప్రెసిడెంట్ రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డిలు పాల్గొన్నారు.
వేంపల్లె : పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు బుధవారం స్థానికి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి వీధుల్లో జాతీయ జెండాలను చేత పట్టుకుని ర్యాలీ నిర్వహించారు.
చక్రాయపేట : మండలంలోని గండిగురుకుల పాఠశాల విద్యార్థులు ప్రిన్సిపాల్ సురేంద్రబాబు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.
జమ్మలమడుగు : పట్టణంలో ఆర్డీఓ శ్రీనివాస్ విద్యార్థులు, అధికారులతో కలసి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ హుస్సేన్ పీరా, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌లు పాల్గొన్నారు.
చింతకొమ్మదిన్నె : కొలుములపల్లి పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.
ఎర్రగుంట్ల : జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. సీఐ నరేష్‌బాబు, తహసీల్దార్ శోభనబాబు, కమిషనర్ రామకృష్ణయ్య, హెచ్‌ఎం రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.


కమలాపురంలో ర్యాలీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు


సీకేదిన్నెలో ..

సలహాలు, సూచనలు పాటించాలి

కమలాపురం : రైతులు వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు అందించే సలహాలు, సూచనలు పాటించాలని మండల వ్యవసాయాధికారిణి సరస్వతి తెలిపారు. బుధవారం మండలంలోని మీరాపురంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆమె వరి పంట గురించి అవగాహన కల్పించారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రతి బుధవారం 14 వారాల పాటు నిర్వహించే పొలంబడి కార్యక్రమంలో విత్తనం మొదలు కోని కోత వరకు అవలంబించే పద్ధతులపై రైతులు అవగాహన చేసుకుని అధిక దిగుబడులు సాధించాలన్నారు. 30 మంది రైతులు 25 ఏకరాల్లో పొలంబడి నిర్వహిస్తున్నారని ఆమె తెలిపారు.

డ్రోన్ స్ప్రేయర్‌పై రైతులకు అవగాహన
వేంపల్లె : ఇడుపులపాయలో నాబార్డ్ సహకారంతో సుస్థిర వ్యవసాయ కేంద్రం, ఏరువాక కేంద్రం కడప వారి ఆధ్వర్యంలో డ్రోన్ స్ప్రేయర్‌పై బుధవారం రైతులకు అవగాహన కల్పించినట్లు ఏరువాక కో ఆర్డినేటర్ అంకయ్య, నాబార్డ్ డీడీఎం విజయ విహారీలు తెలిపారు. ముగ్గురు రైతులకు ఒక్కొక్కరికి ఒక ఎకరాకు ఉచితంగా బయో పెస్టిఫైడ్ మందు ఇచ్చి డ్రోన్ స్ప్రేయర్‌ను ఉపయోగించి మొత్తం 3 ఎకరాలకు స్ప్రే చేయించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఎస్‌ఏ సిబ్బంది, కిసాన్ మిత్ర భాస్కర్, సీఈఓ భవాని, కోఆర్డినేటర్ అశోక్, రైతులు పాల్గొన్నారు.


డ్రోన్ స్ప్రేయర్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన
చక్రాయపేట : రైతులను రసాయన వ్యవసాయ పద్ధతుల నుంచి సేంద్రీయ వ్యవసాయం వైపు దృష్టి మళ్లించేలా వారికి అవగాహన కల్పించాలని పులివెందుల వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ప్రభాకరరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన నాగలగుట్టపల్లె రైతు సేవా కేంద్రంలో సిబ్బందికి సమావేశం నిర్వహించి మాట్లాడారు. సిబ్బంది ఆయా గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉంటూ వారికి ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలను వివరించి వారిని అటు వైపు మళ్లించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నవంత్‌బాబు, ప్రకృతి వ్యవసాయ అధికారి ప్రతాప్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎనిమిది అక్రమ ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వల్లూరు : మండలంలోని పైడికాలువ గ్రామ పంచాయతీ పరిధిలోని జంగంపల్లె సమీపంలో బుధవారం రాత్రి యర్రగుంట్ల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు 8 అక్రమ ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు.
సెబ్ సీఐ లీలారాణి ఆధ్వర్యంలో ఎస్‌ఐ సుబ్రమణ్యం, వారి సిబ్బంది జంగంపల్లె సమీపంలో దాడులు నిర్వహించి పాపాఘ్ని నదిలో ఇసుకను లోడు చేసుకుని తరలిస్తున్న 8 ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఈ మేరకు పట్టుబడ్డ ట్రాక్టర్లకు ఒక్కో దానికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా గురించిన సమాచారాన్ని తమకు తెలిపితే దాడులు నిర్వహించి అక్రమ రవాణాను అరికట్టడానికి చర్యలు చేపడతామని తెలిపారు. దాడులు నిర్వహించే సమయంలో నదిలో సుమారు 20కి పైగా ట్రాక్టర్లు వున్నట్లు సమాచారం. నది నుండి రోడ్డుపైకి చేరే ప్రాంతంలో నిఘా వుంచి ట్రాక్టర్లను పట్టుకుంటున్నారనే సమాచారంతో బారీగా ట్రాక్టర్లు నదిలో నుంచి తప్పించుకున్నట్లు తెలుస్తోంది.


జంగంపల్లె వద్ద పట్టుబడ్డ అక్రమ ఇసుక ట్రాక్టర్ల వద్ద సెబ్ సీఐ లీలారాణి

కమలాపురం ఎస్‌ఐగా ప్రతాప్‌రెడ్డి



కమలాపురం : స్థానిక ఎస్‌ఐగా ప్రతాప్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు జిల్లా చౌడేపల్లి ఎస్‌ఐగా పని చేస్తున్న ఆయన బదిలీ పై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న హృషికేశ్వర్‌రెడ్డి తాళ్లప్రొద్దుటూరు పీఎస్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మట్కా, జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదన్నారు. ఎక్కడైనా ఇలాంటి కార్యకలాపాలు జరుగుతుంటే 91211 00532కు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్‌ఐ తెలిపారు.

పులివెందుల అర్బన్ ఎస్‌ఐగా నారాయణ



పులివెందుల రూరల్ : పట్టణంలో అర్బన్ ఎస్‌ఐగా నారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. కడప రిమ్స్ పరిధిలో ఎస్‌ఐగా పనిచేస్తున్న ఆయన బదిలీపై పులివెందులకు వచ్చారు. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా, అలాగే మట్కా, క్రికెట్ బెట్టింగులు, జూదం, గంజాయి, వాటిపై నిఘా ఉంచుతామన్నారు.

తొండూరు ఎస్‌ఐగా పెద్ద ఓబన్న



తొండూరు : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా బి.పెద్దఓబన్న బుధవారం బాధ్యత లు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ లక్ష్మినారాయణ కడప విఆర్‌కు బదిలీపై వెళ్లారు. సిద్ధవటంలో పనిచేస్తున్న ఎస్‌ఐ పెద్దఓబన్న బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలందరు సహకరించాలన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐగా హృషికేశవరెడ్డి



కొండాపురం : మండలంలోని తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐగా హృషికేశవరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. కమలాపురం ఎస్‌ఐగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ చంద్రశేఖర్ బ్రహ్మంగారిమఠంకు బదిలీ అయ్యారు.